నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 6 అక్టోబర్ 2024 | HYDERABAD

మూసీ గబ్బంతా ముఖ్యమంత్రి, మంత్రుల నోట్లోనే ఉంది. రేవంత్‌రెడ్డి.. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చొద్దు. మాపై కక్ష ఉంటే.. మా ఇండ్లు, నిర్మాణాలు కూలగొడితే నీ కండ్లు చల్లబడతాయి అనుకుంటే కూలగొట్టు కానీ.. పేదల ఇండ్లను మాత్రం కూల్చవద్దు. రెడ్డికుంటలో ఉన్న సీఎం ఇల్లు కూడా చెరువు భాగంలోనే ఉంది. మొదట దాన్ని కూల్చాలి. రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు కూడా చెరువు భూమిలోనే ఉంది. దాన్ని కూడా కూలగొట్టాలి.

గతేడాది డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ చెప్పారు. పది నెలలు గడిచినా.. ఇంతవరకు రుణ మాఫీ చేయలేదు. చారాణా రుణ మాఫీ చేసి.. మొత్తం రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పకొంటున్నారు.
-కేటీఆర్

ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తదితరులు



శనివారం కందుకూరులో జరిగిన రైతు ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ తదితరులు

బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్

కమీషన్ల కోసమే మూసీ సుందరీకరణ

మూసీతో ఎన్ని ఎకరాలకు నీళ్లిస్తరు

పేదల భూములు గుంజుకోవడమే కాంగ్రెస్ పని

ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ఫ్యూచర్ సిటీ ఎలా కడతారు?

అది ఫోర్త్ సిటీ కాదు.. ఫోర్ బ్రదర్స్ సిటీ

రైతులనే కాదు..దేవుళ్లనూ రేవంత్ మోసం చేశారు

కందుకూరు రైతు ధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

పేదల పొట్ట కొట్టి పార్టీ పెద్దలకు కమీషన్లు పంచేందుకే సీఎం రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ పనులు చేపడుతున్నారు. అది బ్యూటిఫికేషన్ కాదు..లూటిఫికేషన్.. రుణమాఫీ చేసేందుకు డబ్బులు లేవని చెప్పే నేతలు.. రూ. లక్షన్నర కోట్లతో మూసీ ప్రక్షాళన చేస్తారట..పథకాలు అమలు చేస్తే కమీషన్లు రావని.. మూసీ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. మూసీతో ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇస్తరు.? దొడ్డు వడ్లకు బోనస్ ఇస్తానని చెప్పి .. సన్న వడ్లకు మాత్రమే ఇస్తున్నారు. రైతులను అన్ని రకాలుగా మోసం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ సర్కారుకు గుణపాఠం చెప్పాలి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం కందుకూరులో జరిగిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తానని కనిపించిన దేవుళ్లపైన ఒట్లు పెట్టి.. రైతులనే కాదు.. చివరకు దేవుళ్లనూ రేవంత్ మోసం చేశారని ధ్వజమెత్తారు. -రంగారెడ్డి, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ)/కందుకూరు

రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా..

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిలా పనిచేయడం లేదని రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఫార్మాసిటీ కోసం 14వేల ఎకరాలను సేకరించామని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో రేవంత్‌తో పాటు కోమటిరెడ్డి, భట్టి, కోదండరెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి బస్సు యాత్రల్లో ఊరూరా తిరిగి అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేసి తిరిగి రైతులకు భూములు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక మాటమార్చి ఫోర్త్ సిటీ అంటున్నారని..అది ఫోర్త్ సిటీ కాదని, ఫోర్ బ్రదర్స్ సిటీ అని ఎద్దేవా చేశారు. పేదల భూములు గుంజుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం పని అని, ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ఫార్మాసిటీని ఎలా కడతారని ప్రశ్నించారు. ఏఐ సిటీ, ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అంటూ దొంగ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఫోర్త్ సిటీలో నిర్మిస్తున్న 300 ఫీట్ల రోడ్డు కోసం రైతులు చేసే పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ న్యాయపరంగా సాయం అందిస్తుందని ప్రకటించారు. ట్రిపుల్‌ఆర్‌ను కేంద్రం వాటాతో పూర్తి చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ..ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే చేస్తుందని రేవంత్ చెబుతున్నారని, కోమటిరెడ్డి సహా అస్మదీయులకు కాంట్రాక్టులు ఇచ్చి దోచుకోవడమే ఆయన ప్రయత్నమని ఆరోపించారు.

ప్రతి పల్లె ఆందోళనలకు సిద్ధం కావాలి

కందుకూరులో జరిగిన రైతు ధర్నా స్ఫూర్తితో ప్రతి పల్లె ఆందోళనలకు సిద్ధం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇక్కడ మొదలైన రైతు నిరసన రాష్ట్రమంతా విస్తరిస్తుందన్నారు. కందుకూరు అంటే కేసీఆర్‌కు అభిమానమని, దాసర్లపల్లిలో ఉన్న ఫాంహౌస్‌లో వాటర్ మిల్లర్, బొప్పాయి పండిచ్చేవారని, వారంలో ఒకటి, రెండు సార్లు తాను కూడా ఇక్కడకు వచ్చేవాడినని చెప్పారు. ఈ ప్రాంతంపై ఉన్న ప్రేమతోనే సబితక్క అడిగిన వెంటనే కేసీఆర్ మెడికల్ కాలేజీని మంజూరు చేశారని గుర్తు చేశారు. ఇక్కడ జరుగుతున్న రైతు ధర్నా ప్రపంచానికి తెలియవద్దనే సీఎం రేవంత్ ఫాక్స్‌కాన్ సందర్శన కార్యక్రమాన్ని పెట్టుకున్నారని విమర్శించారు.

ధర్నా సూపర్ సక్సెస్

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ రైతు ధర్నా సూపర్ సక్సెస్ అయ్యింది. బీఆర్ఎస్ శ్రేణులు రైతన్నలతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిలు ఇద్దరూ అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ ధర్నాలో పాల్గొని బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపారు. ఈ రైతు ధర్నాలో ఎమ్మెల్సీ మహమూద్ అలీ, బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి, వికారాబాద్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, నవీన్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ నాయకులు పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి, రజినీ సాయిచంద్, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మదర్ డెయిరీ స్టేట్ మాజీ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్.. ఆగస్టు 15 ఇంకా రాలేదా?

-సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి

రుణమాఫీపై అన్ని దేవుళ్ల మీద ఒట్లు పెట్టిన రేవంత్‌కు ఆగస్టు 15 ఇంకా రాలేదా?. మైక్ తీసుకుంటే చాలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లను తిట్టడమే రేవంత్ పనిగా పెట్టుకున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు వదిలేది లేదు. ఫాక్స్ కాన్ కంపెనీ తెచ్చిందే కేసీఆర్. లక్ష ఉద్యోగాలు తెచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. నాకు మూడు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని రేవంత్ అంటున్నారు. అవి ఎక్కడ ఉన్నా కూల్చుకోవచ్చు.

రేవంత్‌కు కూల్చడం తప్ప..కట్టడం తెలియదు

నాకు ఒక్కటే ఇల్లు ఉంది. మూడు ఫామ్‌హౌస్‌లు ఎక్కడ ఉన్నాయో.. రేవంత్ చెప్పాలి. కేసీఆర్‌కు నదుల గురించి తెలిస్తే.. రేవంత్‌కు ఫామ్‌హౌస్‌ల నుంచి మురుగు నీరు ఎక్కడెక్కడ పారుతుందో తెలిసినట్లుంది. కూల్చడం కాదు.. దమ్ముధైర్యం ఉంటే ఫార్మాసిటీని ఏర్పాటు చెయ్యి.. మెట్రో సదుపాయాన్ని కల్పించాలి. మెడికల్ కాలేజీని నిర్మించాలి. రైతులను నాశనం చేసిన ఘనత కాంగ్రెస్‌దే. రేపు మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే. - కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ యువనేత

నమ్మి మోసపోయాం

సీఎం రేవంత్‌రెడ్డిని నమ్మి మోసపోయాం. ప్రజలకు ఇస్తానన్న మాట ప్రకారం నిలబడత లేదు. మాకు ఇస్తానన్న పింఛన్లు ఇవ్వడం లేదు. మహిళల ఉసురుతగలుతది. బతుకమ్మ చీరలు లేవు. కేసీఆర్ సారే బాగుండు. కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం కాను. -వెంకటమ్మ

మాటలకు చేతలకు పొంతన లేదు..

సీఎం రేవంత్‌రెడ్డి మాటలకు చేతలకు పొంతన లేదు. రుణ మాఫీ చేస్తానని చెప్పాడు. రైతు బంధు పెంచుతానని చెప్పిండు. రైతు బంధు లేదు.. రుణమాఫీ లేదు. పైగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. కేసీఆర్ పాలనలో ఇట్లుండేనా.. చెప్పినట్లు చేసిండ్రు. ఇచ్చిన మాట ప్రకారం నిలబడాలి. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు తిరుగబడాలి.
-కాలె శంకరయ్య, ఆకులమైలారం

ఫోర్త్‌సిటీ పేరుతో మోసం

సీఎం రేవంత్‌రెడ్డి ఫోర్త్‌సిటీ పేరుతో మోసం చేస్తుండు. మూడు రోడ్లు ఉండగా మరో 3వందల అడుగుల రోడ్డు వేయడానికి ప్రయత్నిస్తుర్రు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తే పొంతన లేని సమాధానం ఇస్తుండ్రు. ఫోర్త్ సిటీ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రియల్ వ్యాపారం చేస్తుండ్రు. ఫార్మాసిటీని రద్దు చేసి పొలాలను తిరిగి రైతులకు ఇస్తానన్న హామీ ఏమైంది.
-నీరటి శ్రీకాంత్, అగర్‌మియగూడ

మాట తప్పిన రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట తప్పిండు. సన్నాలకు రూ. 500 ఇస్తానని చెప్పిండు. రైతు బంధు, రూ. 15వేలు ఇస్తానన్నాడు. రుణమాఫీ చేస్తానని మాట తప్పిండు. రైతుల ఉసురు ఊరికే పోదు. రైతు నిరుత్సాహంగా ఉన్నారు. సమయం వచ్చినప్పుడు అన్నదాతలు గుణపాఠం చెబుతారు. రేవంత్‌రెడ్డిని గద్దె దింపాలి.
-చల్లా శేఖర్‌రెడ్డి, జైత్వారం, కందుకూరు.

రుణమాఫీ విషయంలో తలోమాట

- మంచిరెడ్డి కిషన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు

రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి, మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారు. రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. రైతులు తిరగబడే రోజులు త్వరలోనే వస్తాయి. రేవంత్ పాలనలో అమలు చేస్తున్నవన్నీ ఫెయిల్యూరే. ఇంత దరిద్రమైన సీఎంను నేనెప్పుడూ చూడలేదు. రుణమాఫీ విషయంలో రైతులను గోస పెడుతున్నారు. దసరా తర్వాత ఇబ్రహీంపట్నంలోనూ రైతు ధర్నా నిర్వహిస్తాం.

రైతును రాజుగా ఘనత కేసీఆర్‌దే..

- సురభి వాణీదేవి, ఎమ్మెల్సీ

పీవీ నర్సింహారావు రైతు కూలీని రైతుగా చేస్తే..రైతును రాజు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా క్షేమాన్ని పట్టించుకోవడం లేదు. ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేయడం తప్పితే.. రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసా, రుణమాఫీ వంటివి చేయడం లేదు. ఒక తప్పును కప్పిపుచ్చుకునేందుకు మరో తప్పును చేస్తున్నారు.

మ్యాన్‌హోల్‌లోకి దిగి..

సోమాజిగూడ డివిజన్ అమీర్‌పేట మార్కెట్ రోడ్‌లో డ్రైనేజీలన్నీ నిండిపోయి.. మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు ఏరులై పారుతున్నది. సమస్య పరిష్కారం కోసం స్థానిక కాంగ్రెస్ కార్పొరేటర్ సంగీతతో పాటు ఆమె భర్త శ్రీనివాస్ యాదవ్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా.. స్పందించడంలేదు. దీంతో కార్పొరేటర్ భర్త శ్రీనివాస్‌యాదవ్ తన అసంతృప్తిని బహిరంగంగానే ప్రదర్శించారు. శనివారం ఏకంగా నిండిపోయిన మ్యాన్‌హోల్‌లో దిగి.. తన నిరసన తెలిపారు. ఇప్పుడు ఈ ఉదంతం చర్చనీయాంశమైంది. అధికార పార్టీ నేతల మాటలను అధికారులు కూడా వినడం లేదా..? అని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
-ఖైరతాబాద్, అక్టోబర్ 5

4 కార్పొరేషన్లుగా గ్రేటర్

పేర్లతో పాటు సరిహద్దుల ఖరారుపై కసరత్తు

ట్రైసిటీస్‌కు తోడుగా 'శంషాబాద్'?

కార్పొరేషన్‌గా ఏర్పాటుకు పరిశీలన

సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధి విస్తరించి, నాలుగు ముక్కలు కానున్నది. ఔటర్ రింగు రోడ్డును సరిహద్దుగా చేసుకొని ఏర్పాటు చేయనున్న హైదరాబాద్ మహానగరాన్ని పరిపాలనా సౌలభ్యం, నిధుల లభ్యత కోసం ఒకటే కార్పొరేషన్ కాకుండా ఒకేసారి 4 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఓఆర్ఆర్ లోపల ప్రస్తుతం జీహెచ్ఎంసీతో పాటు శివారు ప్రాంతాల్లో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీలను కలిపి కొత్తగా 4 గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఇప్పటికే దీనిపై కసరత్తు చేస్తున్నది. ఓఆర్ఆర్ లోపల ఉన్న గ్రామ పంచాయతీలను సైతం పక్కనే ఉన్న మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో ఈ ప్రక్రియ మరింత వేగం పుంజుకున్నది. సుమారు 51 గ్రామపంచాయతీలను విలీనం చేసినట్లు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పదవీ కాలంతో పాటు శివారు ప్రాంతాల్లోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీలకు ఈ ఏడాది చివరి వరకు గడువు ఉండటంతో ఈ లోపే గ్రేటర్ హైదరాబాద్‌ను ఎన్ని భాగాలు చేయాలో నిర్ణయించనున్నారు. ఇదే విషయమే ఇటీవల మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌ను 4 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తామని, నలుగురు మేయర్లు వస్తారని ప్రకటించడంతో మరింత స్పష్టత వచ్చింది.

4 కార్పొరేషన్ల పేర్లపై కసరత్తు..

ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ పరిధిలోకి ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని మున్సిపాలిటీలను విలీనం చేసిన తర్వాత 4 కార్పొరేషన్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఓఆర్ఆర్ లోపలి భాగంగా ఉన్న మొత్తం ప్రాంతాన్ని 4 కార్పొరేషన్లు అంటే... హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్, శంషాబాద్ పేర్లతో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా సహేతుకంగా ఉంటుందనే అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

సుమారు 2500 చదరపు కి.మీ..

ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ విస్తీర్ణం 625 చదరపు కి.మీలు ఉండగా, ఓఆర్ఆర్ వరకు విస్తరించడం వల్ల ఒకేసారి దాని పరిధి సుమారు 2500 చదరపు కి.మీ మేర అయ్యే అవకాశం ఉంది. జనాభా ప్రాతిపదికన డివిజన్లు చేసి, 4 కార్పొరేషన్లలో డివిజన్లు సమానంగా ఉండేలా నిర్ణయించిన తర్వాత ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది.

విలీనంతో ఓఆర్ఆర్ లోపల 2 కోట్ల జనాభా..

ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ, 7 కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీలన్నింటిని ఒక్కటిగా మార్చడం ద్వారా ఓఆర్ఆర్ లోపల నివాసముండే జనాభా ఒకేసారి 1.80 లక్షల నుంచి 2 కోట్లకు చేరుకుంటుందని అంచనా. హెచ్ఎండీఏను ట్రిపుల్‌ఆర్ వరకు విస్తరిస్తే దాని కోసం కొత్తగా మాస్టర్‌ప్లాన్‌ను 2050 పేరుతో రూపొందిస్తే ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ హెచ్ఎండీఏ పరిధిలోనూ వస్తుందని ఓ ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారు.

శంషాబాద్ పేరు ప్రతిపాదన..

హైదరాబాద్ మహానగరాన్ని ఆయా ప్రాంతాలను బట్టి ట్రై సిటీస్‌గా అభివర్ణిస్తున్నారు. హైదరాబాద్,సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడు కొత్తగా మరో 'బాద్'గా శంషాబాద్ పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

మూసీ బాధితులకు అండగా ఉంటాం

బీఆర్ఎస్ అడ్వకేట్ ప్యానల్‌తో కోర్టులో పోరాడుతాం

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 5: మూసీ నిర్వాసితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, వారి తరపున క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం 'నమస్తే తెలంగాణ' ప్రతినిధితో మాట్లాడుతూ.. కొత్త పేట, చైతన్యపురి డివిజన్ల పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతాల నిర్వాసితుల పక్షాన తాము ముందుండి పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున మూసీ నిర్వాసితుల కోసం అడ్వకేట్స్ ప్యానల్ ఏర్పాటు చేశామని, వారి తరపున కోర్టులో వీరు పోరాటం చేస్తారన్నారు. గత ప్రభుత్వ హయాంలో మూసీ సుందరీకరణలో పెద్ద ఎత్తున ప్రజల నివాసాలు పోతాయని సర్వేలో తాము గుర్తించి..అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి మూసీ బోర్డు చైర్మన్‌గా తాను, కేటీఆర్ సూచిస్తే పేదలకు ఇబ్బంది కలిగించే కార్యక్రమం వద్దంటూ కేసీఆర్ సూచించారని, ఎక్కువ నష్టం కలుగకుండా ఎలా చేద్దామని ఆలోచన చేసే క్రమంలోనే ఎన్నికలు వచ్చి ప్రభుత్వం మారిపోయిందన్నారు.

జీహెచ్ఎంసీకి కొత్తగా 125 మంది ఏఈఈలు

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో ఇంజినీరింగ్ విభాగంలో మరింత బలోపేతం కానున్నది. రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు 146 మంది ఏఈఈలు కొత్తగా నియమాకం కాగా.. ఇందులో జీహెచ్ఎంసీకి 125 మంది ఏఈఈలు రిపోర్టు చేశారు. ఈ మేరకు వీరంతా సోమవారం జీహెచ్ఎంసీలో జాయిన్ రిపోర్టు ఇచ్చి ఆయా పదవిలో బాధ్యతలు చేపట్టనున్నారు.